క్లుప్తంగా

లారీ ఓనర్ల అధ్యక్షుడిగా సత్యనారాయణ



కమిటీ అధ్యక్షుడిని అభినందిస్తున్న ఎమ్మెల్యే పాయం

మణుగూరు టౌన్: మణుగూరు లారీ ఓనర్ల వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ అధ్యక్షుడిగా మల్లేటి బాల సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో లారీ ఓనర్ల అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా పెంట్యాల దశరథం, ప్రధాన కార్యదర్శిగా మేరెడ్డి సురేందర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా నాగేశ్వరరావు, ఎస్ఆర్‌కే రాము, సహాయ కార్యదర్శిగా అడపా స్వామి, వెంకటసోములు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వెంకన్న, భాస్కర్, కోశాధికారిగా పిన్నపురెడ్డి జైపాల్‌రెడ్డితో పాటు మరో 9 మంది కమిటీ సభ్యులు, ముగ్గురు ఆడిట్ కమిటీ సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన కమిటీని ఎమ్మెల్యే అభినందించారు.

ఎంబీబీఎస్‌లో సీటు



షారోన్ సెర్లిస్

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామానికి చెందిన పాస్టర్ సునీల్ కుమార్తె షారోన్ సెర్లిస్ ఈ ఏడాది విడుదల చేసిన నీట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయి 2,068 ర్యాంకు సాధించి వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కాలేజీలో సీటు సాధించింది. ఈ సందర్భంగా పలువురు ఆమెను అభినందించారు.

చీరల పంపిణీ

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని లబ్ధిదారులకు ఎమ్మెల్యే వెంకట్రావు సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. కాగా కొన్ని అనివార్య కారణాల దృష్ట్యా ఈ కార్యక్రమాన్ని మధ్యలోనే ఆపివేయాలని ఆదేశాలు రావడంతో చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిలిపివేశారు.

మల్టీపర్పస్ వర్కర్ల సమస్యలపై వినతి

అశ్వాపురం: మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లోని మల్టీపర్పస్ వర్కర్ల సమస్యలపై సీఐటీయూ అనుబంధ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీఓ ముత్యాలరావుకు వినతిపత్రం అందజేశారు. వర్కర్లకు యూనిఫాం, శానిటేషన్ కిట్లు, ఐడీ కార్డులు ఇవ్వాలని పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. యూనియన్ అధ్యక్షుడు గద్దల శివకృష్ణ, పల్లె రమేష్, బండ్ల జలేందర్, చంద్రశేఖర్, లక్ష్మణ్, నాగరాజు, రాము, వెంకన్న, యాకయ్య, రమేష్, శ్రీను, సందీప్, నరేష్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పాలస్తీనాపై దాడులను అరికట్టాలి



మాట్లాడుతున్న ఉమర్

చండ్రుగొండ: పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను మానవతావాదులందరూ ఖండించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ పార్టీ నాయకులు ఎస్‌కె.ఉమర్ అన్నారు. పార్టీ మండల కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు కారం వెంకటేశ్వర్లు, తేజావత్ భీముడు, రసూల్, లాల్‌బీ, జరీనా పాల్గొన్నారు.

కరకగూడెంలో భారీ వర్షం

కరకగూడెం: మండల వ్యాప్తంగా సోమవారం రాత్రి 7 గంటల నుంచి సుమారు రెండు గంటలు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. కొద్ది రోజులుగా వేసవిని తలపించేలా కాస్తున్న ఎండలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేశాయి. అంతేకాకుండా పొలాలకు నీరందక ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. వీటన్నింటికి ఉపశమనం కలిగించేలా కురిసిన వర్షంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కరకగూడెంలో కురుస్తున్న వర్షం

బస్సు బంద్‌తో బాధలు..

అర్ధాంతరంగా చండ్రుగొండ -హైదరాబాద్ ఆర్టీసీ సర్వీస్ రద్దు

- ప్రయాణికులకు తప్పని తిప్పలు
- సర్వీసును పునరుద్ధరించాలని వేడుకోలు



హైదరాబాద్ బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న అధికారులు (ఫైల్)

చండ్రుగొండ: హైదరాబాద్ బస్సు సర్వీసును ఆర్టీసీ అధికారులు రద్దు చేయడంతో ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. రెండేళ్లుగా నడుస్తున్న ఈ సర్వీసును ఇటీవల అర్ధంతరంగా నిలిపివేశారు. ఈ ప్రాంతవాసుల దశాబ్దాల కల సాకారమైందనుకుంటే ఆర్టీసీ సంస్థ అధికారులు సర్వీసు నిలిపివేయడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చండ్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాలకు చెందిన విద్యార్థులు, వ్యాపారస్తులు, ప్రజలు నిత్యం హైదరాబాద్‌కు రాకపోకలు చేస్తుంటారు. ఈ క్రమంలో ఇక్కడి ప్రజల అవసరాలను గుర్తించి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బస్సు సర్వీసు మంజూరు చేసింది. అప్పటి రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రత్యేక చొరవతో 2022 ఏడాది నవంబర్ 9న బస్సు సర్వీసు ప్రారంభమైంది. కొత్తగూడెం డిపోకు చెందిన సూపర్ లగ్జరీ సర్వీసు చండ్రుగొండ, ఎర్రగుంట, వీఎం బంజర్, కల్లూరు, తల్లాడ, వైరా, ఖమ్మం మీదుగా మియాపూర్ (హైదరాబాద్) చేరుకునేది.

పునరుద్ధరిస్తే ప్రయాణం సులభం..

దాదాపు రెండేళ్లపాటు నడిచిన ఈ సర్వీసుతో ఈ ప్రాంత ప్రజలకు సదుపాయం ఉండేది. కానీ తాజాగా సర్వీసు రద్దు నిర్ణయం తీసుకోవడంతో స్థానికులు హైదరాబాద్ వెళ్లాలంటే .. కొత్తగూడెం లేదా వీఎం బంజర్ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. రాత్రి సమయాల్లో హైదరాబాద్‌కు రావాలన్నా, ఇక్కడ నుంచి వెళ్లాలన్నా చాలా ఇబ్బంది ఉందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే పాత సర్వీసు ఉంటే ప్రయాణం సులభంగా ఉండేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్సు సర్వీసు పునరుద్ధరించాలని కోరుతున్నారు.

ఆదరణ తగ్గడం వల్లే సర్వీసు రద్దు..

హైదరాబాద్ సర్వీసుకు ఆక్యూపెన్సీ తగ్గడంతోనే సంస్థ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బస్సును రద్దు చేశాం. వీకెండ్‌లో ఆదాయం ఉంటున్నా.. మధ్యరోజుల్లో ఆక్యూపెన్సీ రావడం లేదు. మరోమారు రూట్ చెక్ చేసి పై అధికారులకు నివేదిస్తాం. పరిస్థితిని సమీక్షిస్తాం.

– ఎం.దేవేందర్‌గౌడ్, డీఎం, కొత్తగూడెం

ఇబ్బందులు పడుతున్నాం..



మా అబ్బాయి హైదరాబాద్‌లో చదువుతున్నాడు. హైదరాబాద్ సర్వీసు ఉంటే విద్యార్థుల రాకపోకలకు సౌకర్యంగా ఉండేది. బస్సు సర్వీసు రద్దు సరికాదు. సత్వరమే బస్సు సర్వీసు పునరుద్ధరించాలి.

– కీసరి కిరణ్‌కుమార్‌రెడ్డి, చండ్రుగొండ

ఉపయుక్తంగా ఉండేది



వైద్యానికి, విద్యార్థులు వెళ్లే వారికి హైదరాబాద్ బస్సు సర్వీసు ఉపయుక్తంగా ఉండేది. అంత ఉపయోగంగా ఉండే సర్వీసు రద్దు చేయడం ఆశ్చర్యంగా ఉంది. వెంటనే సర్వీసు పునరుద్ధరించాలి.

– నరుకుళ్ల వాసు, రైతు, అయన్నపాలెం

అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం



బస్సు సర్వీసును ఆర్టీసీ అధికారులు రద్దు చేయడం వారి నిర్లక్ష్య ధోరణికి అద్దం పడుతోంది. ఒక్కోసారి కనీసం సీట్లు కూడా దొరకని పరిస్థితిలో ప్రయాణికులు ఉన్న ఈ సర్వీసును ఎలా రద్దు చేస్తారు.

– కొదకండ్ల వెంకటరెడ్డి, మాజీ జెడ్పీటీసీ, చండ్రుగొండ

‘ప్రజాపాలన’లో తప్పని అవస్థలు



జెండా ఆవిష్కరించి నినాదాలు చేస్తున్న నాయకులు

కరకగూడెం: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజా పాలన పేరుతో రాష్ట్రంలో కొనసాగిస్తున్న పాలనలో సంక్షేమ పథకాలు అందక ప్రజలకు కష్టాలు తప్పడం లేదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నిమ్మల వెంకన్న ఆరోపించారు. మండలంలోని అశ్వాపురంపాడులో సోమవారం పార్టీ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఆరుగ్యారంటీలను విస్తృతంగా ప్రచారం చేసి, అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి తీరా అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్నా నేటి వరకు పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. డిజిటల్ సర్వే ప్రక్రియనును పారదర్శకంగా చేపట్టాలన్నారు. వలస ఆదివాసీ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు రోడ్లు, విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని లేనిపక్షంలో పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించి నినాదాలు చేసారు. ఈ కార్యక్రమానికి శాఖ కార్యదర్శి మడివి ఉంగయ్య, మండల కార్యదర్శి కొమరం కాంతారావు, చర్ప సత్యం, కొవ్వాసీ వెంకటేష్, కొవ్వాసీ గంగయ్య,పాడియం అడమయ్య తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: పేదవాడి కష్టాలు ఉన్నంతకాలం ఎర్రజెండా ఉంటుందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ అన్నారు. మండలంలోని కాశీనగరం శాఖ మహాసభలో ఆయన మాట్లాడారు... ప్రపంచంలో కమ్యూనిజంపై సానుకూలత పెరుగుతుందని, దీనికి నిదర్శనం శ్రీలంక ఎన్నికలే అన్నారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ కనకదుర్గ, మాజీ ఉపసర్పంచ్ గడ్డం సతీష్, చలపతిరావు, కుంజా సరోజిని, పెనినా, నాగేశ్వరరావు నాయకులు పాల్గొన్నారు.

జీవీ మాల్ ప్రారంభం



చీరను పరిశీలిస్తున్న సినీనటి అనసూయ

మణుగూరు టౌన్: మణుగూరు మండల పరిధిలోని అశోక్‌నగర్‌లో ఏర్పాటుచేసిన జీవీ మాల్ షోరూంను స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, సినీ నటి అనసూయ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతమైన పినపాక నియోజకవర్గంలో షోరూం ఏర్పాటు అభినందనీమని అన్నారు. పలు రకాల వస్త్రాలతో పాటు 1 గ్రామ్ గోల్డ్‌తో తయారుచేసిన వస్తువులను అందుబాటు ధరల్లో ఉంచామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కేటీ గ్రూప్స్ అధినేత దోసపాటి వెంకటేశ్వరరావు, షోరూం అధినేత గుర్రం ఉమామహేశ్వరరావు, నరేన్ తదితరులు పాల్గొన్నారు.

హరిత శోభితం.. ఆహ్లాదం.!



హరిత పందిరిలా అల్లుకున్న వృక్షాలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని అచ్యుతాపురం నుంచి మద్దికొండ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి వెంట గతంలో సోషల్ ఫారెస్టు ఆధ్వర్యంలో భారీగా మొక్కలు నాటారు. ఆ మొక్కలు పెరిగి నేడు మహావృక్షాలుగా మారడమే కాదు, రహదారికి పచ్చని పందిరిలా అల్లుకున్నాయి. దాదాపు రెండు కిలోమీటర్ల వరకు రోడ్డుకు ఇరువైపులా వృక్షాలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. దీంతో ఈ మార్గం గుండా వెళ్లే ప్రయాణికులకు హరిత వృక్షాలు ఆహ్లాదంతోపాటు, నీడను అందిస్తున్నాయి. ఈ దృశ్యాన్ని ‘సాక్షి’ క్లిక్ మనిపించింది.

ఆదమరిస్తే అంతే సంగతులు..



ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంత

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ఐటీడీఏ రోడ్డులో ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానం సమీపంలో ప్రధాన రహదారిపై గుంత పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే రోడ్డుపై భారీ గుంత పడిన ఎవరూ పటించుకోకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో గుంతను అంచనా వేయలేక వాహనదారులు ప్రమాదాల భారిన పడి గాయాలపాలవుతున్నారు. ఈ గుంతలో పడ్డ వాహనాలు సైతం మరమ్మతులకు గురవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, గుంతను పూడ్చే విధంగా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.



రాత్రి సమయంలో గుంతలో పడిన కారు(ఫైల్)

సెంచరీకి చేరువలో..!

- రోజురోజుకు పెరుగుతున్న ఉల్లి, టమాటా ధరలు





బూర్గంపాడు: కూర ఏదైనా అందులో ఉల్లిపాయ ఉండాల్సిందే.. అన్ని రకాల కూరల్లో టమాటా వేసుకోవాల్సిందే. కానీ ప్రస్తుతం వాటి ధరలు చూస్తుంటే కొనటం, తినటం కష్టంగానే ఉంది. ప్రస్తుతం ఉల్లి, టమాటా ధరలు సెంచరీకి చేరువలో ఉన్నాయి. వారం రోజుల క్రితం వరకు కిలో టమాటా రూ.60 పలికగా ఉల్లిపాయలు కూడా ఇంచుమించు అదే ధరలో ఉన్నాయి. కానీ ఈ వారం ఈ రెండు కూడా వందరూపాయలు పలుకుతున్నాయి. మార్కెట్‌లో నాణ్యమైన తాజా టమాటాలు కిలో రూ.100లకు విక్రయిస్తున్నారు. కొంత నాణ్యత లేని నిల్వ సరుకును రూ.80 వరకు అమ్ముతున్నారు. ఉల్లిపాయలు కూడా గ్రేడ్ –1 రకం కిలో రూ.100కు చేరింది. సన్నవి, చిన్నవి కిలో రూ.80 పలుకుతుంది. దీంతో పేదలు, మధ్యతరగతి ప్రజలు ఈ రెండు కొనాలంటేనే భయపడుతున్నారు. అయితే ఇవి రెండు లేకుండా కూరలు చేయటం కొంత కష్టమైన పనే. గత నెలలో తెలుగు రాష్ట్రాలలో కురిసిన భారీ వర్షాలకు టమోటో తోటలు దెబ్బతిన్నాయి. అదే విధంగా ఉల్లి పంటకు కూడా నష్టం వాటిల్లింది. దీంతో ప్రస్తుతం ఈ రెండింటి ధరలు అమాంతంగా పెరిగిపోతున్నాయి. మరో నెలరోజుల పాటు ఈ పరిస్థితులు ఉంటాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో సాగు చేసిన టమాటా మరో నెల ఉంటేనే రైతుల చేతికందుతుంది. అదేవిధంగా ఉల్లి పంట కూడా నవంబర్ నెలలో రైతులకు అందే అవకాశాలున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి ఉల్లి, టమాటాను దిగుమతి చేసుకుంటేనే ఏమైనా కొద్దో గొప్పో ధరలు తగ్గే అవకాశాలుంటాయని వ్యాపారులు చెబుతున్నారు.

ఆరోగ్యంగా ఉండడమే ముఖ్యం



ఆకుకూరల ప్రాముఖ్యతను వివరిస్తున్న మధు

కరకగూడెం: ప్రస్తుత రోజుల్లో మనిషి ఆరోగ్యంగా ఉండడమే ముఖ్యమైన అంశమని కరకగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కారం మధు పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని రేగళ్ల గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో కలియ తిరుగుతూ పలువురి ఇంటి ఆవరణలో నిల్వ ఉన్న నీటిని సిబ్బందితో పారబోయించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. అంతేకాకుండా ఆకుకూరల ప్రాముఖ్యత వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ పోలెబోయిన క్రిష్ణయ్య,హెచ్ఏ కృష్ణ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిమితికి మించి..



గోదావరి వంతెన మీదుగా పరిమితికి మించి లోడ్‌తో వెళ్తున్న మినీ లారీ

భద్రాచలంఅర్బన్: భద్రాచలం మీదుగా జాతీయ రహదారి గుండా సారపాక మీదుగా వాహనదారులు పరిమితికి మించిన లోడుతో ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. రైస్‌మిల్లుల్లో వరిపొట్టు, పాత సామాన్ల లోడ్లు, ప్లాస్టిక్ డ్రమ్ములు, బిందెలు, ఖాళీ సీసాలు వంటివి ఒకే వాహనంలో పరిమితికి మించి ప్రమాదకర రీతిలో తరలిస్తున్నారు. దీన్ని అరికట్టాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి వాహనాల కారణంగానే ట్రాఫిక్ సమస్య తలెత్తటంతో పాటు, ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. పరిమితికి మించి లోడులతో వెళ్తున్న వాహనాలు వేగంలో అదుపు తప్పి ప్రమాదాలు జరిగే సంఘటనలు అనేకం ఉన్నాయంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, పరిమితి మించి లోడ్లతో వెళ్తున్న వాహనాలను అడ్డుకుని, ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరుతున్నారు.

ఐద్వా మహాసభలను జయప్రదం చేయండి

సింగరేణి(కొత్తగూడెం): అనునిత్యం మహిళా హక్కుల కోసం, మహిళల భద్రతకు, అన్ని వర్గాల ప్రజల కోసం పోరాటం చేస్తున్న అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర మహాసభలు ఈనెల 21, 22, 23 తేదీల్లో భద్రాద్రి కొత్తగూడెంలో జరుగనున్నాయని, ఈ మహాసభలను జయప్రదం చేయాలని ఐద్వా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ సోమవారం ప్రకటనలో తెలిపింది . కొత్తగూడెం పట్టణంలో జరిగే ఈ సభలకు పట్టణంలోని అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాల్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చింది.

అమ్మవారికి పూజలు, అభిషేకాలు



భద్రాచలంటౌన్: అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ దంపతులు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం ఆదర్శ్‌నగర్ కాలనీలో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సలలో భాగంగా సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్‌-ప్రవీణ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు లక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారిని దర్శించుకుని కుంకుమ పూజ, అభిషేకం, నూతన వస్త్రలంకరణ, పుష్పాంజలి కార్యక్రమాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో నవాబ్, సరిత, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: పర్ణశాల దేవస్థానంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవముల సందర్భంగా సోమవారం శ్రీ మహాలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక అలంకారం చేసి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం కుంకుమార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ముఖ్య అర్చకులు శేషం కిరణ్ కుమారాచార్యులు, నరసింహాచార్యులు, శ్రీరంగమ్ వెంకటాచార్యులు, ఆలయ ఇన్‌చార్జ్ అనిల్ కుమార్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చండీదేవిగా..

దమ్మపేట: మండల పరిధిలో పలుచోట్ల ఏర్పాటు చేసిన మండపాల్లో అమ్మవారు చండీదేవి రూపంలో దర్శనమిచ్చారు. అమ్మవారిని ఎర్రని వస్త్రాలు, పూలతో ఘనంగా అలంకరించారు. వేదపండితులచే శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, రకరకాల పిండి వంటలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు.

ములకలపల్లి: మండలకేంద్రంలోని శ్రీభక్త అభయాంజనేయ స్వామి ఆలయంలో సామూహిక కుంకుమార్చన ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు మహాచండీగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. కుంకుమార్చనలో మహిళలు భారీగా హాజరుకాగా, పూజారి ముకందల సత్యనారాయణ శాస్త్రి శాస్త్రోక్తంగా పూజాక్రతువు నిర్వహించారు. అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, గాడి తిరుపతిరెడ్డి, బోడపట్ల భూషమ్మ, శగనపాటి సుదర్శన్, శనగపాటి అంజి, పూజారి ముకందల సత్యానారాయణ శాస్త్రీ దంపతులను కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు.

కరకగూడెం: మండల పరిధిలోని రాళ్లవాగు శ్రీ పెద్దమ్మ తల్లి దేవస్థానం నందు అమ్మవారు మహా చండీ దేవీ అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అంతేకాకుండా ప్రణవ ఓంకారం శివలింగ స్వరూపంలో దీపాలంకరణ సేవ, శ్రీ దుర్గ సప్త శతి దేవీ ఖడ్గమాల స్తోత్ర పారాయణం ప్రధానార్చకుడు ఉల్లి నరసింహాచార్యులు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు.



దుమ్ముగూడెం: మహాలక్ష్మి అవతారంలో అమ్మవారు



దమ్మపేట: చండీదేవిగా..



కరకగూడెంలో..



ములకలపల్లిలో అన్నదానం..